thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

**ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం**



11

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 23 | కరీంనగర్ | గురువారం | 9 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

**15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్**

**హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్**

4



రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెం డు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది.

> ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



## ఇది యుద్ధానికి ముగింపు కాదు

**మొజ్తాబా ఖమేనీ సంచలనం**

**10న ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు**

.. వివరాలు 4లో



# ఖర్చుగా కాదు భాగస్వామ్యంగా చూడండి

### ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి

**అవసరమైన సహకారం అందిస్తాం**

**సీఎస్ఆర్ నిధులపై కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు.

మిగతా 2 లో



వివరాలు 2వ పేజీలో

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

సీఎం రేవంత్ రెడ్డిని రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిశారు. హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన ఆయన ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఘనా, తెలంగాణ మధ్య మైత్రీ సంబంధాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.



## ప్రజల కోసమే పనిచేస్తా

**జన్మభూమికి దేవ్ జీ**

వివరాలు 4లో.

## తాగుబోతు ర్యాష్ డ్రైవింగ్ ముగ్గురి మృతి

**వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిన కారు**

**మృతుల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు, మరో యువకుడు**

**ఘటనాస్థలంలో విద్యార్థుల భారీ ఆందోళన**



.. వివరాలు 2లో





3

## ఏసీబీ పంజా

**ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులు అరెస్ట్!**

**రూ. 2 లక్షలు తీసుకుంటూ చిక్కిన శంషాబాద్ సీఐ, ఎస్సై**

**రిటైర్డ్ టీచర్ ఫైల్ కోసం రూ. 15 వేలు నొక్కిన ఎంఈఓ**



## 'ఘోష్' సస్పెన్స్!

**పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై తీర్పు వాయిదా**

**22న తుది నిర్ణయం వెలువరించనున్న హైకోర్టు**

**మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల పిటిషన్లపై ఉత్కంఠ**

2

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై లైంగికదాడి

2

**ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం**

**హరీష్ వనపర్తి పర్యటనకు**

## గ్రీన్ సిగ్నల్

**ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు**

3





# తాగుబోతు ర్యాష్ డ్రైవింగ్ ముగ్గురి మృతి

## వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిన కారు

### మృతుల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు, మరో యువకుడు

### ఘటనాస్థలంలో విద్యార్థుల భారీ ఆందోళన..

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఓ తాగుబోతు డ్రైవర్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. మూడు కుటుంబాల్లో కడుపుకోత పెట్టాడు. ముగ్గురు యువకులు దర్మరణం చెందారు. భవిష్యత్‌పై ఎంతో కలలతో ఇంజనీరింగ్‌లో అడుగుపెట్టిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వీరిని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళ్తున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. భారీగా పోలీసులు మోవరించడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తిని తమకు అప్పగించాలని విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై లైంగికదాడి

## యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్ట్రక్టర్‌గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్ట్రక్టర్ సల్మాన్. యువతిపై లైంగికదాడి జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్. పలు మార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉండడం తో బేగంపేట పోలిస్ లకు ఫిర్యాదు చేసింది. జనవరి 2025 నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

## తిమ్మాపూర్ వద్ద అంతర్రాష్ట్ర ముఠా బీభత్సం!

### పోలీసులనే చుట్టుముట్టిన 30 మంది దుండగులు

### సినీ ఫక్కీలో ఛేజింగ్.. ఇద్దరు మహిళలు అరెస్ట్

**తిమ్మాపూర్, ఏప్రిల్ 8 :** తెలంగాణలో రైలు ప్రయాణికులను వణికించే ఘటన చోటుచేసుకుంది. ఒడిశా, బిహార్ తరహాలో రైలుపై భారీస్థాయిలో రాళ్లదాడి జరగడం రాష్ట్రంలో కలకలం రేపింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు మెరుపు దాడికి పాల్పడ్డారు. గస్తీ పోలీసులు సకాలంలో స్పందించి ఎదురుదాడి చేయడంతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, నిందితులను పట్టుకునే క్రమంలో జరిగిన ఛేజింగ్ ఉత్కంఠ రేకెత్తించింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘోరం జరిగింది. రైలు వెళ్తున్న సమయంలో ట్రాక్ పక్కన పొదల్లో మాటువేసిన సుమారు 30 మంది దుండగుల ముఠా ఒక్కసారిగా రైలుపై రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు బలంగా తగలడంతో ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలియక భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో రైల్వే ట్రాక్ సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఠాను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా, ఆ 30 మంది సభ్యులు పోలీసులనే రౌండప్ చేసి దాడికి తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గస్తీ పోలీసులు వెంటనే అదనపు బలగాల సాయం కోరారు. భారీగా పోలీసులు వస్తున్నారని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరుగులు తీశారు. పోలీసులు వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. నందిగామ మండలంలోని ఎన్‌సీఎల్ వెంచర్ గుండా చీకట్లో పడి నిందితులు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ముఠాలోని ఇద్దరు మహిళలు పోలీసులకు చిక్కారు. పట్టుబడిన మహిళలను బిహార్, ఒడిశా లేదా రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా చూడండి..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల



సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఏఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



# తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన
- వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు




**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 17వ తేదీన అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారంభం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం విచారణపై కొనసాగుతున్న 'ఘోష్' సస్పెన్స్!

## పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై తీర్పు వాయిదా

### 22న తుది నిర్ణయం వెలువరించనున్న హైకోర్టు

### మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల పిటిషన్లపై ఉత్కంఠ

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై



తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.



# ఏసీబీ పంజా..

## ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులు అరెస్ట్!

## రూ. 2 లక్షలు తీసుకుంటూ చిక్కిన శంషాబాద్ సీఐ, ఎస్సై

## రిటైర్డ్ టీచర్ ఫైల్ కోసం రూ. 15 వేలు నొక్కిన ఎంఈఓ

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఏసీబీ అధికారులు మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. ఉదయం మహబూబాబాద్ మండలం గూడురు గ్రామంలో ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా శంషాబాద్ పరిధిరో సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఏసీబీ వలకు చిక్కారు. శంషాబాద్ పరిధిలోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో అరెస్టు చేయకుండా కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకున్న ఇద్దరు పోలీసు అధి కారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాజీవ్ గాంధీ విమానాశ్రయం పోలీసు అవుట్ పోస్టులో సీఐగా పనిచేస్తున్న యూ.కె సిద్దేశ్వర్, ఎస్సై సంపతి కనకయ్య రూ. 2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కేసులో చార్జిషీట్, అరెస్టు చేయకుండా చూడాలని బాధితుడు కోరగా వారు రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో మొదటి విడతగా 2 లక్షలు ఒప్పందం జరిగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

### మహబూబాబాద్ జిల్లాలో హెడ్మాస్టర్

**మహబూబాబాద్:** ఉపాధ్యాయుడు లంచావతారమెత్తాడు. ఏకంగా హెడ్మాస్టర్ లంచం తీసుకోవడంతో చర్చనీయాంశమైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. గూడూరు మండలం అయోధ్యపురంలో పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇన్చార్జ్ ఎంఈఓగా వ్యవహరిస్తున్న రవికుమార్ టీచర్ ఫైల్ క్లియర్ చేయడం కోసం డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.15000 లంచమిస్తూ ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు హెడ్మాస్టర్ ను పట్టుకున్నారు. రిటైర్డ్ కాబోయే ఉపాధ్యాయుడి నుంచి ముడుపులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు హెడ్మాస్టర్ పట్టుబడడంతో కలకలం రేపింది. విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# హరీష్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్

## జిల్లా ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు వనపర్తి పర్యటనకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హరీశ్ రావుకు వనపర్తి జిల్లాలో పర్యటించేందుకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదన్న జిల్లా ఎస్పీ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గొల్లపల్లి రిజర్వాయర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, వారికి మద్దతుగా మాజీ మంత్రి అక్కడి పర్యటించి భారీ బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించారు. ఈ సభకు తొలుత జిల్లా ఎస్పీ అనుమతులు ఇచ్చారు. అనంతరం అకస్మాతుగా అనుమతులు రద్దు చేస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అనుమతులు ఇచ్చి ఆపై నిరాకరించారంటూ పిటిషన్ వేశారు. సభకు అనుమతులు ఇప్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై నేడు ధర్మాసనం విచారణ చేపట్టగా.. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే హరీశ్ రావుకి అనుమతి నిరాకరించినట్లు పోలీసుల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు అనుమతి తీసుకున్నా చివరి నిమిషంలో నిరాకరించారని హరీశ్ రావు తరఫు న్యాయవాది తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం సభకు పర్మిషన్ ఇస్తూ ఆదేశాలిచ్చింది.

# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

## అప్పడే వెళ్లి రైతులను వేధించాలా

## హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ

**సంగారెడ్డి, ఏప్రిల్ 8 :** ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే అంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.



# కాళేశ్వరం మోటర్లపై కుట్ర?

- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ
- అశాస్త్రీయ నిర్వహణతో పంపులు దెబ్బతినే ప్రమాదం
- రాజకీయాల కోసం ప్రాజెక్టులను పాడు చేయొద్దని హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరానికి సంబంధించిన భారీ నీటిపారుదల మోటర్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ మోటర్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేయడం వల్ల పంపుల పనితీరు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



### నిర్లక్ష్యమా.. కుట్రనా?

పదే పదే మోటర్లను ఆపడం వల్ల వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్ వంటివి పాడయ్యే ప్రమాదం ఉందని హరీశ్ రావు హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటర్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12లలో మోటర్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు.

### ప్రాజెక్టులతో చెలగాటం వద్దు

తక్షణమే మోటర్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఆయన సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్‌కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. భారీ మోటర్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవని, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్ రావు స్పష్టం చేశారు.


# ప్రధాని వ్యూహాలు అమోఘం

- నితిన్ నబీన్ నియామకంపై లక్ష్మణ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు మాదేనని ధీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి వైపు గాలి వీచిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో జరిగిన ఇష్టాగోష్టిలో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఆలోచనలు ఎవరికీ అందవని, రెండో వ్యక్తికి కూడా తెలియని విధంగా ఆయన నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవరూ ఊహించలేదని, ఇది అందరినీ ఆశ్చర్యపరిచిన విషయమని లక్ష్మణ్ వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి నిలబడటం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

### కవిత ప్రశ్నలు.. హేట్ స్పీచ్ పై నిలదీత

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పడం లేదని లక్ష్మణ్ గుర్తు చేశారు. అయితే ఆమె ఇప్పుడు ప్రస్తావిస్తున్న అంశాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఊహించలేదని, తెలంగాణ ప్రజలు కూడా ఎంతో తెలివైన వారని కొనియాడారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు రాగా.. ప్రజలు ముప్పై ఎనిమిది శాతం ఓట్లు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని జోస్యం చెప్పారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ తర్వాత దేశమంతా ఏకపక్షంగా మారుతుందని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి జనం వస్తున్నా.. ఐదారు సీట్ల కంటే ఎక్కువ రావని అన్నారు. హేట్ స్పీచ్ బిల్లు తెస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. ఇది హేట్ స్పీచ్ కాదా అని సీఎంను సూటిగా ప్రశ్నించారు.



# కాంగ్రెస్‌కు తెలంగాణే ఏటీఎం!

## ఢిల్లీకి గులాంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం

## ఏప్రిల్ 25న చరిత్రను మారుస్తాం: కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హైకమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.



# తెలంగాణ భవన్ ముట్టడి.. ఉద్రిక్తత!

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ భవన్ వద్ద బుధవారం భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గందరగోళం, తోపులాట జరగడంతో వాతావరణం వేడెక్కింది. పరిస్థితి అదుపు తప్పకుండా అధికారులు అదనపు బలగాలను అక్కడ మోహరించారు. పోలీసుల తీరుపై జేఏసీ నేతలు మండిపడ్డారు. ఉద్యమకారులను బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం దగ్గర తమ సమస్యల గురించి బిఆర్ఎస్ ఎందుకు గళం విప్పడం లేదని ప్రశ్నించారు. కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఉత్కంఠ నెలకొంది. తమ ఇబ్బందులను పట్టించుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఖచ్చితంగా తమ గోడు వినాలంటూ భవన్ వద్ద నినాదాలు చేశారు.

# జగిత్యాల పాలిటిక్స్‌లో బిగ్ ట్విస్ట్

## నేడు జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్!



**జగిత్యాల, ఏప్రిల్ 8:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం పార్టీ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఒక సంచలన భేటీకి వేదిక కాబోతుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ కానుండటం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి, రాజీనామా అనంతరం సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. స్థానికంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయన పార్టీ మారతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. నేటి పర్యటనలో భాగంగా కేటీఆర్ నేరుగా జీవన్ రెడ్డిని కలిసి, ఆయనను అధికారికంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఉత్తర తెలంగాణలో బలమైన పట్టున్న జీవన్ రెడ్డి వంటి నేత పార్టీలోకి వస్తే, అది బీఆర్ఎస్‌కు కొండంత అండగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేటీఆర్ రాక సందర్భంగా జగిత్యాల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. జీవన్ రెడ్డి అనుచరులు కూడా ఈ పర్యటనపై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి గులాబీ తీర్థం పుచ్చుకుంటే, ఆయన ఎప్పుడు జెండా పడతారనే విషయంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేటీఆర్ పర్యటనతో జగిత్యాల జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



## సంపాదకీయం

# ప్రపంచాన్ని బలి చేసిన 'ట్రంప్' యుద్ధోన్మాదం

## అమెరికా ఆధిపత్య కాంక్షకు సామాన్యులే బలి!

అగ్రరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు సామాన్య దేశాలకు శాపంగా మారుతున్నాయి. అమెరికా-ఇజ్రాయిల్‌ల యుద్ధ కాంక్ష వల్ల ఇరాన్ చితికిపోవడమే కాదు, ప్రపంచమంతా చమురు సెగతో విలవిల్లాడుతోంది. తాత్కాలిక కాల్పుల విరమణ కాదు, శాశ్వత శాంతే ప్రపంచానికి అవసరం. రాజకీయ ప్రయోజనాల కోసం దేశాల మధ్య చిచ్చు పెట్టడం అగ్రరాజ్యాలకు అలవాటుగా మారింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూల నిరంకుశ వైఖరి వల్ల మధ్యప్రాచ్యం అగ్నిగుండంగా మారింది. ఇరాన్‌పై బాంబు దాడులు చేయడం, ఆ దేశ అత్యున్నత నేత అయతుల్లా ఆలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా సాధించింది శూన్యం. కానీ, ఈ యుద్ధ జ్వాలలు సృష్టించిన విధ్వంసం మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది.

### చమురు దౌత్యం.. డాలర్ ఆధిపత్యం

అమెరికా ఇరాన్‌పై దాడికి దిగడం వెనుక కేవలం రాజకీయ కారణాలే లేవు, ప్రధానంగా ముడి చమురుపై పెత్తనం మరియు 'డాలర్' సర్వాధిపత్యాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. వెనెజువెలా తరవాత ఇరాన్‌ను లొంగదీసుకోవడం సులభమని భావించిన ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ప్రతిస్పందనగా హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు సరఫరా అస్తవ్యస్తమైంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 శాతం కేవలం ఈ చిన్న జలసంధి ద్వారానే జరుగుతుంది. దీనిని మూసివేయడం అంటే ప్రపంచ ఆర్థిక నరాలను తెంచడమే. రవాణాకు ఆటంకం ఏర్పడటంతో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. చమురు ధరల్లో స్వల్ప మార్పు వచ్చినా అది రవాణా, విద్యుత్, ఉత్పత్తి రంగాలపై పెను ప్రభావం చూపుతుంది. నేడు విమాన ప్రయాణాలు భారంగా మారడం నుంచి అంతర్జాతీయ విమానాలు రద్దు కావడం వరకు అన్నీ ఈ యుద్ధోన్మాద ఫలితాలే.

### ద్రవ్యోల్బణం: మూడవ ప్రపంచ దేశాల పాలిట శాపం

ఈ యుద్ధం వల్ల ధనిక దేశాల కంటే ఆసియా, ఆఫ్రికా వంటి మూడవ ప్రపంచ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయి. చమురు ధరలు పెరగడంతో డాలర్ విలువ పెరిగి, స్థానిక కరెన్సీల విలువ పడిపోతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడి కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. కేవలం చమురు మాత్రమే కాదు, దాని ఆధారిత ఉత్పత్తులైన ఎరువుల కొరత ఏర్పడి, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఇది ఆహారధాన్యాల కొరతకు దారి తీసి, శ్రామిక ప్రజానీకాన్ని ఆకలి కోరల్లోకి నెట్టే ప్రమాదాన్ని సూచిస్తోంది. డాలర్ విలువ ముడిచమురుతో ముడిపడి ఉంది. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడేస్తున్నాయి. చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం కోసం చమురు ఉత్పత్తి దేశాలపై రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది.

### బెడిసికొట్టిన వ్యూహం.. మేల్కొని ప్రపంచం

ఇరాన్‌లో తమకు అనుకూలమైన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న అమెరికా వ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. ఏకపక్ష దాడులు చేస్తే ఎదురుదాడులు తప్పవని ఇరాన్ చర్యలు నిరూపించాయి. ట్రంప్ ప్రకటించిన రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరమణ కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. నిజానికి యుద్ధాన్ని శాశ్వతంగా ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో అమెరికా భాగస్వామి కావాలి. సామ్రాజ్యవాద విస్తరణ, ముడిపదార్థాల కోసం ఆక్రమణ యత్నాలు ఇకపై సాగవని ట్రంప్ తెలుసుకోవాలి. వెనెజువెలాలో చేసిన ప్రయోగాలు ఇరాన్‌లో పారవని ఈ నెల రోజుల అనుభవం స్పష్టం చేసింది. ఒక అగ్రరాజ్యం తన అహంకారం కోసం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయడం అత్యంత అనైతికం మరియు చట్టవిరుద్ధం.

**ముడి పదార్థాలపై అదుపు సాధించడం కోసం యుద్ధాలు చేయడం వల్ల ప్రపంచం చెల్లిస్తున్న మూల్యం అపారం. పెట్టుబడిదారీ ప్రపంచం స్థిరంగా ఉండాలంటే శాంతి అవసరం. ఇప్పటికైనా అమెరికా తన యుద్ధోన్మాదాన్ని వీడాలి. కేవలం తన డాలర్ ప్రయోజనాల కోసం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం అనే అగాధంలోకి నెట్టడం ఆపాలి. అప్పుడే ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఊపిరి పీల్చుకోగలవు.**



# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

- 15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్
- హర్మ్యూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్టు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఇది యుద్ధానికి ముగింపు కాదు

- మొజ్తాబా ఖమేనీ సంచలనం
- 10న ఇస్లామాబాద్‌లో చర్చలు



**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 8:** ప్రపంచం ఊపిరి పీల్చుకునే వార్త.. యుద్ధ మేఘాల మధ్య చిన్న ఆశారేఖ! గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాను వణికించిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల పాటు 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరింది. అయితే, ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇది యుద్ధానికి ముగింపు కాదు.. కేవలం విరామం మాత్రమే. మా సైన్యం వేళ్లు ఇంకా గన్ ట్రిగ్గర్‌ల పైనే ఉన్నాయి. శత్రువు ఏమాత్రం దురాక్రమణకు పాల్పడినా పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం" అని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతానికి తక్షణమే దాడులు నిలిపివేయాలని తన సైనిక విభాగాలను ఆయన ఆదేశించారు.

### పాక్ మధ్యవర్తిత్వానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించారు. హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించడంతో, రెండు వారాల పాటు దాడులు చేయబోమని ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొల్పడానికి ఈ 14 రోజుల గడువు ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ పెట్టిన 10 ప్రధాన డిమాండ్లు (ఆంక్షల ఎత్తివేత, హర్మ్యూజ్‌పై నియంత్రణ వంటివి) కూడా సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

### ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు:

శాంతి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరు దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగనున్న ప్రత్యక్ష చర్చల్లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ చర్చల గురించి వైట్‌హౌస్ స్పందిస్తూ.. తుది నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటారని వెల్లడించింది. ప్రపంచ చమురు మార్కెట్ కుప్పకూలకుండా ఉండాలంటే ఈ చర్చలు సఫలం కావడం అత్యంత అవసరమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అమెరికాకు మద్దతిస్తాం.. కానీ


అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్ కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా- ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### లెబనాన్‌పై దాడులు..

లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ.. ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగించడం గమనార్హం.

# ప్రజల కోసమే పనిచేస్తా...

మొహమ్మద్ మతీన్



**కోరుట్ల, ఏప్రిల్,08 :** ప్రజల కోసమే పని చేస్తానని... తాను ఎక్కడున్నా ప్రజా సమస్యల పరిష్కారమే తన ఎజెండా అని స్పష్టం చేశారు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ. ఎక్కడ తన అవసరముంటే అక్కడకు వెళతానంటూ చెప్పుకొచ్చారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత సొంతూరు కోరుట్లకు వచ్చిన సందర్భంగా మీడియా ప్రతినిధులతో కాసేపు ముచ్చటించారు. 1983లో ఉద్యమ బాట పట్టిన దేవ్‌జీ మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్న దేవ్‌జీ ఇటీవలే సహచర నేతలతో కలిసి లొంగిపోయారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కూడా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అయితే స్వగ్రామం కోరుట్లకు రావడానికి కొంత సమయం పట్టింది. 42 ఏళ్ల తర్వాత దేవ్‌జీ కోరుట్లకు రావడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కాసింత భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యమంలోకి వెళ్లేటప్పుడు తాను ఇక ఇంటికి తిరిగి రాలేనేమోనని అనుకున్నానే తప్ప... ఇలా మీ ముందుకు వస్తానని కలలో కూడా ఊహించలేదని అన్నారు. పరిస్థితుల ప్రభావం వల్ల జనజీవన స్రవంతిలోకి రావాల్సి వచ్చిందని.. ఇకపై కూడా ప్రజల పక్షాన నిలబడేందుకు ప్రజాక్షేత్రంలో ఉంటానని తెలిపారు. ఆపరేషన్ కగార్ తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన దేవ్‌జీ అడవిబాట వీడి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వివిధ కారణాల రీత్యా ఇప్పటివరకు హైదరాబాద్‌లోనే ఉన్న దేవ్‌జీ తొలిసారిగా స్వగ్రామం కోరుట్లకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే లొంగిపోయిన తర్వాత చాలా సందర్భాల్లో మీడియాతో మాట్లాడిన దేవ్‌జీ ఇక క్రీయాశీల రాజకీయాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ విషయం కాస్తా చర్చానీయాంశమైంది. అదే క్రమంలో కోరుట్లలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ప్రజల కోసం తన అవసరం ఎక్కడుంటే అక్కడకు వెళతానని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల తరపున నిలబడతానని స్పష్టం చేశారు.

కోరుట్లలోని అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ విప్లవ భావజాలానికి ఆకర్షితులయి... 1983లో మావోయిస్టు ఉద్యమంలో చేరారు. అనతికాలంలోనే పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ మావోయిస్టు పార్టీలో ఉన్నతస్థానమైన దక్షిణ భారత జోన్ ఆపరేటర్‌గా కొనసాగారు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో సీనియర్ సభ్యుడిగా పనిచేసిన దేవ్‌జీ... సెంట్రల్ రీజనల్ బ్యూరోకి మార్గనిర్దేశనం చేసేవారు. 2010 ఏప్రిల్ లో దంతెవాడలో జరిగిన మావోయిస్టు దాడిలో 74 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది మృత్యువాత పడ్డారు. అయితే ఆ ఘటనకు దేవ్‌జీ ప్రధాన సూత్రధారి అనేది పోలీస్ వర్గాలు చెప్పే మాట. మావోయిస్టు పార్టీలో చేరిన తర్వాత తిప్పిరి తిరుపతి కాస్తా దేవ్‌జీ అయ్యారు. సంజీవ్, చేతన్, రమేశ్, సుదర్శన్, దేవన్న తదితర పేర్లతో పిలిచేవారు సహచరులు. నంబాల కేశవరావు మరణం తర్వాత 2025 సెప్టెంబర్‌లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు దేవ్‌జీ. అయితే ఆపరేషన్ కగార్ తదితర పరిణామాల నేపథ్యంలో... తన సహచరులు మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డితో కలిసి ఫిబ్రవరి 22వ తేదీన తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. 42 సంవత్సరాల తర్వాత దేవ్‌జీ స్వస్థలానికి వస్తున్నారనే సమాచారంతో ఆయన్ని చూడటానికి జనాలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

# సురక్షితంగా ఇరాన్‌ను వీడండి

### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్-అమెరికా (ఎసజీని-జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మీషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

## తెలంగాణ ధీరుడు
# ఆలె నరేంద్ర

**ఏప్రిల్ 9...ఆలె నరేంద్ర వర్ధంతి**



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దశాబ్దాలుగా సాగిన ఉద్యమంలో, ఎన్నో గొంతులు ఆవిరై పోయాయి. కొన్ని మాత్రం ప్రజల గుండెల్లో నిలిచి పోయాయి. అలాంటి మహాను భావుల్లో ప్రముఖ నాయకుడు ఆలె నరేంద్ర ఒకరు. రాజకీయాలు ఆయనకు ఒక అధికార మార్గంగా కాకుండా, ఉద్యమ సాధనగా ఉండేవి. తెలంగాణ సాధనకు తన జీవితాన్ని అంకిత మిచ్చిన ఆయన, నిజంగా "తెలంగాణ యోధుడు" అనే బిరుదుకు అర్హులు.

ఆలె నరేంద్ర 1946 ఆగస్టు 21న జన్మించారు. నాంపల్లి పరిసరాల్లో పుట్టి పెరిగిన ఆయన విద్యాభ్యాసం పూర్తి చేసి, చిన్ననాటి నుండే దేశ రాజకీయాలపై ఆసక్తితో ఎదిగారు. విద్యార్థి దశ నుండే ఆయన్ని ఆకర్షించిన భావజాలం – ప్రజల కోసం పనిచేయాలనే తపన. ఆయనను అభిమానులు ముద్దుగా 'టైగర్' నరేంద్ర అని పిలుచుకునేవారు. స్వాభిమానాన్ని కలిగించే నేతగా ఎదగాలన్న కల ఆయనను రాజకీయాల్లోకి నడిపించింది. పద్మశాలి కుటుంబంలోపుష్పవతి, రామలింగం దంపతులకు జన్మించారు. తమ్ముడు ఆలె శ్యామ్ కూడా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో ప్రచారక్‌గా ఉన్నారు.

ఆలె నరేంద్ర భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన 1983, 1988, 1992లో హిమాయత్ నగర్ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజల మనిషిగా ఆయనకు మంచి గుర్తింపు ఉండేది. 1999 మరియు 2004లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుండి రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ నగరం స్థూలంగా మజ్లిస్ పార్టీ ఆధిపత్యంలో ఉండగా, బీజేపీ అభ్యర్థిగా ఆయన విజయం సాధించడం ఒక చారిత్రక ఘట్టంగా మారింది. ఆయన నియోజకవర్గంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

బీజేపీ కేంద్రంగా పనిచేసినా, ఆలె నరేంద్ర ఎప్పుడూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేశారు. అయితే పార్టీ ఆ దిశగా స్పష్టమైన ప్రకటన ఇవ్వక పోవడం ఆయనలో అసంతృప్తి కలిగించింది. రాజకీయ లబ్ధి కన్నా ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని నమ్మిన ఆయన, 2004లో బీజేపీకి రాజీనామా చేసి "తెలంగాణ సాధన సమితి" అనే కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఇది ఆ సమయంలో పెద్ద సంచలనమే.

ఆయన నిర్ణయం చాలామందికి స్ఫూర్తిదాయకంగా మారింది. రాజకీయ భవిష్యత్తుపై శ్రద్ధ చూపకుండా, తాను నమ్మిన ఉద్యమం కోసం రాజకీయంగా మలుపు తిరగడం అన్నదే ఆయన ధైర్యాన్ని, అంకితాన్ని సూచిస్తుంది.

ఆలె నరేంద్ర రాజకీయ వ్యవహార శైలి స్పష్టత, నిజాయితీ, మరియు ప్రజల పట్ల ఉన్న ప్రామాణికతకు పరిమితమై ఉండేది. ఆయన సభలు, మాట్లాడే తీరు, మాట్లాడే అంశాలు యువతలో చైతన్యం కలిగించేవి. తెలంగాణ యాసలో మాట్లాడి, ఉద్యమాన్ని ప్రజల మనసులోకి తీసుకెళ్ళారు. ఉద్యమంలో ఆయనకు ఉన్న స్థానం ఎంతో ప్రత్యేకం.

2006లో ఆలె నరేంద్ర తీవ్రమైన అనారోగ్యంతో హఠాత్తుగా మృతిచెందారు. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి, ముఖ్యంగా ఉద్యమంలో ఉన్న స్ఫూర్తికి పెద్ద నష్టంగా పరిగణించబడింది. ఉద్యమ దశలో తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రజల కోసమే బలంగా పోరాడిన ఆయన లాంటి నేతల మరణం ఉద్యమాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆయన పేరు మళ్ళీ మళ్ళీ ప్రస్తావించబడుతోంది. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ప్రజల పక్షంగా నిలబడిన ధైర్యం, పార్టీ వ్యతిరేకంగానైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన తత్వం నేటి రాజకీయ నాయకులకు మార్గదర్శకంగా నిలు స్తోంది. ఒక అధికార స్థానం కోసం కాకుండా, ఒక ప్రజా రాష్ట్రం కోసం జీవించిన నేతగా చరిత్రలో ఆలె నరేంద్ర గారు నిలిచి పోతారు.

ఆలె నరేంద్ర ఒక నేత మాత్రమే కాదు – ఒక ఉద్యమ స్వరూపం. తెలంగాణ కోసం తపించిన మనిషి. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలవడం ఖాయం. ఆయన చూపిన మార్గం, పోరాట పంథా యువతకు స్ఫూర్తి. తెలంగాణ మనుగడకు పునాదులు వేసిన నేతలలో ఆయన పాత్ర కూడా చిరకాలం గుర్తుండి పోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్...9440595494.**

# యుద్ధ మేఘాల మధ్య విరమణ వెలుగు...

## శాంతి ప్రయత్నాల వెనుక అంతర్జాతీయ రాజకీయాలు...



పశ్చిమాసియా ప్రాంతం గత కొన్నేళ్లుగా ప్రపంచ రాజకీయాలలో అత్యంత ఉద్రిక్తతలు, వ్యూహాత్మక పోటీలు, ఆర్థిక ప్రయోజనాల సంగమంగా నిలుస్తోంది. తాజాగా అమెరికా తన సైనిక స్థావరాల నుండి దశలవారీగా నిష్క్రమణ ప్రారంభించగా, ఇరాన్‌తో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించడం ఒక కీలక మలుపుగా మారింది. ఈ పరిణామాన్ని ఐక్యరాజ్య సమితి స్వాగతించడం మాత్రమే కాదు, అంతర్జాతీయ సమాజం కూడా దీనిని శాంతి వైపు తీసుకెళ్లే మొదటి అడుగుగా అభివర్ణిస్తోంది. ఇదే సమయంలో ప్రపంచ చమురు రవాణాకు ప్రాణాధారంగా ఉన్న హార్ముజ్ జలసంధిను తెరవడానికి ఇరాన్ అంగీకరించడం గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోసినట్లయింది.

ఈ పరిణామాల పూర్వాపరాలను విశ్లేషిస్తే, పశ్చిమాసియా సంక్షోభం ఒక్కరోజులో ఏర్పడినది కాదు. 2003లో ఇరాక్ యుద్ధంతో ప్రారంభమైన అమెరికా ప్రత్యక్ష జోక్యం, తరువాత సిరియా అంతర్గత యుద్ధం, యెమెన్ సంక్షోభం, ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణలు—ఇవి అన్నీ కలిసి ప్రాంతాన్ని అస్థిరత వైపు నెట్టాయి. అమెరికా గల్ఫ్ ప్రాంతంలో సుమారు 40కి పైగా సైనిక స్థావరాలను నిర్వహిస్తూ, 45,000 నుండి 60,000 మధ్య సైనికులను నియమించిందని రక్షణ విశ్లేషకుల అంచనా. మరోవైపు ఇరాన్ తన వ్యూహాన్ని విస్తరించుకుంటూ లెబనాన్‌లో హిజ్బుల్లా, యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులకు మద్దతు ఇస్తూ ప్రత్యక్షంగా కాకపోయినా ప్రభావాన్ని పెంచుకుంది.

ఇటీవలి కాలంలో ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. గల్ఫ్ ప్రాంతంలో ఆయిల్ ట్యాంకర్లపై దాడులు, డ్రోన్ దాడులు, సైబర్ యుద్ధ చర్యలు అంతర్జాతీయ ఆందోళనకు దారి తీసాయి. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత హెచ్చరికలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయి. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 18 నుండి 20 శాతం వరకు ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం నిలిచిపోతే ధరలు అమాంతం పెరుగుతాయి. ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 95–105 డాలర్ల మధ్య ఊగిసలాడాయి.

ఈ నేపథ్యంలో అమెరికా తన వ్యూహాన్ని పునరాలోచించుకోవాల్సి వచ్చింది. విదేశీ యుద్ధాలపై భారీగా ఖర్చవుతున్న బడ్జెట్, దేశీయంగా పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు, సైనికుల ప్రాణనష్టం—పునరాలోచనకు దారి తీసాయి. 2025 నాటికి అమెరికా రక్షణ వ్యయం 850 బిలియన్ డాలర్లకు చేరిన నేపథ్యంలో, దీర్ఘకాలిక యుద్ధాల్లో కొనసాగడం సాధ్యంకాదని భావించింది. అందుకే దశలవారీగా ఉపసంహరణను ప్రారంభించింది. ఈ నిర్ణయం కేవలం సైనిక చర్య కాదు; ఇది ఒక వ్యూహాత్మక మార్పు—ప్రత్యక్ష జోక్యం నుంచి పరోక్ష ప్రభావానికి మారడం.



ఇరాన్ కూడా ఈ పరిస్థితిని అనుకూలంగా మలచుకోవాలని భావించింది. అమెరికా ఆంక్షల వల్ల దెబ్బతిన్న తన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించు కోవడానికి అంతర్జాతీయ వాణిజ్య మార్గాలను తెరవడం అత్యవసరమైంది. హార్ముజ్ జలసంధి తెరవడం ద్వారా రోజుకు దాదాపు 17 నుండి 20 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరే అవకాశం ఉంది. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలు 10–12 శాతం వరకు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

ఈ కాల్పుల విరమణకు అంతర్జాతీయ రాజకీయాలు ప్రధాన కారణమయ్యాయి. యూరోపియన్ దేశాలు మధ్యవర్తిత్వం చేసి ఈ ఒప్పందానికి దారి తీశాయి. యూరోపియన్ యూనియన్ కూడా ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు రష్యా, చైనా వంటి దేశాలు కూడా ప్రాంతీయ స్థిరత్వాన్ని కోరుకుంటూ ఈ ఒప్పందాన్ని మౌనంగా మద్దతు ఇచ్చాయి. ఎందుకంటే పశ్చిమాసియా అస్థిరత ప్రపంచ వాణిజ్యాన్ని, ఇంధన భద్రతను ప్రభావితం చేస్తుంది.

అయితే విరమణ అనంతర పరిస్థితులు అంత సులభం కావు. మొదటగా, ప్రాంతంలో ఇంకా చురుకుగా ఉన్న మిలిటెంట్ గుంపులు ఈ ఒప్పందాన్ని భంగం చేసే అవకాశం ఉంది. రెండవది, అమెరికా ఉపసంహరణ తర్వాత ఏర్పడే శక్తి శూన్యత. ఈ ఖాళీని ఇరాన్ భర్తీ చేయడానికి ప్రయత్నిస్తే, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్ వంటి దేశాలు ప్రతిస్పందించే అవకాశం ఉంది. దీంతో మరో కొత్త శక్తి సమీకరణం ఏర్పడే అవకాశముంది.

ఆర్థిక పరంగా కూడా ఈ పరిణామాలు కీలక ప్రభావం చూపనున్నాయి. చమురు సరఫరా స్థిరపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది ముఖ్యంగా అనుకూలం. అయితే రాజకీయ అస్థిరత కొనసాగితే విదేశీ పెట్టుబడులు తగ్గే ప్రమాదం ఉంది. పశ్చిమాసియాలో యుద్ధాల వల్ల ధ్వంసమైన మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి కనీసం 400 నుండి 500 బిలియన్ డాలర్ల వరకు అవసరమని అంచనా.

భవిష్యత్ దిశపై విశ్లేషణ చేస్తే, ఈ విరమణ ఒక పరీక్షా దశ మాత్రమే. రెండు వారాల కాలంలో ఇరు పక్షాలు నమ్మకాన్ని పెంపొందించుకుంటే, దీన్ని దీర్ఘకాల శాంతి ఒప్పందంగా మార్చే అవకాశం ఉంది. లేదంటే ఇది తాత్కాలిక విరామంగా మిగిలి పోతుంది. ముఖ్యంగా అమెరికా–ఇరాన్ సంబంధాల సాధారణీకరణ, ఆర్థిక ఆంక్షల సడలింపు, ప్రాంతీయ దేశాల సహకారం—ఇవి అన్నీ కీలక అంశాలు.

పశ్చిమాసియాలో తాజా పరిణామాలు ఒక కీలక దశను సూచిస్తున్నాయి. యుద్ధ మేఘాల మధ్య కనిపిస్తున్న ఈ విరమణ వెలుగు శాశ్వత శాంతికి మార్గం చూపుతుందా లేదా మరో సంక్షోభానికి నాంది పలుకుతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది. అయితే ఒక విషయం స్పష్టం—ప్రపంచ రాజకీయాలలో పశ్చిమాసియా ప్రాధాన్యం తగ్గలేదు; మారింది మాత్రం వ్యూహం, మార్గం, దృక్పథం. శాంతి కోసం జరుగుతున్న ఈ ప్రయత్నాలు అంతర్జాతీయ రాజకీయాల సంక్లిష్టతను మరోసారి రుజువు చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9449595494**

# సమ్మె, సంక్షోభం, సంస్కరణలు.. ఆర్టీసీ భవిష్యత్తు ఎటు?

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయింబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది.

సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (VAT) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చు కోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్శిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.



ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు మరియు సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది.

ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 10 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం మొండి వైఖరిని వీడి, కార్మికుల న్యాయమైన కోర్కెలను సానుకూలంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది.

అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# విరాళాలు ఇచ్చి అండగా నిలవాలి

- అధికారుల దృష్టికి ఎన్టీఆర్ నగర్ వాసుల సమస్యలు
- సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ




**ఎల్బీనగర్, ఏప్రిల్ 8 :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు ఇంటింటి సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ హాజరై, ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా బాతరాజు నర్సింహ మాట్లాడుతూ, ఎన్టీఆర్ నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, త్రాగునీరు రావడం లేదని, కలుషిత నీరు సరఫరా అవుతోందని వాపోయారు. రోడ్లను ఆక్రమించి కట్టడాలు నిర్మించిన కారణంగా పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రోడ్లు ఆక్రమించి కట్టడాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాడైపోయిన చేతిపంపులను వెంటనే బాగు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. సీపీఐ కార్యకర్తలు తమ వంతుగా పార్టీకి విరాళాలు అందించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అవి పరిష్కారం అయ్యేంతవరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు రమావత్ సక్రు నాయక్, భగత్ సింగ్ నగర్ ఫేస్ టూ శాఖ కార్యదర్శి ఉష భాగ్యమ్మ, సీపీఐ సీనియర్ నాయకులు వర్రీ ఇస్తారి, పద్మ, జమున, కమలమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# లోప్రెషర్ నీటి తిప్పలు తప్పించండి

- అధికారులకు సీపీఎం వినతిపత్రం
- పరిష్కరిస్తామని అధికారుల హామీ

**ఎల్బీనగర్, ఏప్రిల్ 8 :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సీపీఎం హయత్ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో హెచ్ఎం డబ్ల్యూ ఎస్ జనరల్ మేనేజర్ కు మంచినీటి సమస్యపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం హయత్ నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ శారద నగర్, పరిసర కాలనీలలో మంచినీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తెలిపారు. లోప్రెషర్ సమస్య కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నెలల తరబడి నీటి కష్టాలు

గత ఐదారు నెలల నుండి ఈ ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, లోప్రెషర్ ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమస్యను సీజీఎం నాగేంద్ర కుమార్, జనరల్ మేనేజర్ మహేంద్ర నాయక్ ల దృష్టికి తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించారు. ప్రాంతాన్ని పరిశీలించి భవిష్యత్తులో నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు ముషం నరహరి, శాఖ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఆ పిల్లలు.. మన పిల్లలే!

- జవహర్ నగర్ బస్తీల్లో విద్యా, వైద్యానికి పటిష్ఠ ప్రణాళిక
- డంపింగ్ యార్డు చెంతనే స్కూళ్ల ఏర్పాటుకు డిమాండ్
- బాలల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్

**హయత్ నగర్, ఏప్రిల్ 8 :** మేడ్చల్ జిల్లా జవహార్ నగర్ డంపింగ్ యార్డు బస్తీల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు కోసం విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ డిమాండ్ చేశారు. ఆయా బస్తీలకు దగ్గరలోనే స్కూళ్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వ అధికారులు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని కోరారు. ముఖ్యమంత్రే విద్యాశాఖను



నిర్వహిస్తున్నందున జవహార్ నగర్ బస్తీ సమస్యలపై ప్రత్యేక ఆదేశాలివ్వాలని, అక్కడ ఎల్ కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాలలు నిర్మించాలని విన్నవించారు.

### సమ్మర్ క్యాంపులు.. అధికారుల సమన్వయం

జవహార్ నగర్ బస్తీల్లో వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టి బడి ఈడు పిల్లలను గుర్తించాలని సంఘం నాయకులు కోరారు. ఈ వేసవిలో సమ్మర్ క్యాంపులు నిర్వహించి పిల్లలకు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి వారిని సిద్ధం చేసేందుకు కార్మిక, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి, కలెక్టర్ కు లేఖలు రాశారు. స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖలన్నీ "ఆ పిల్లలు మన పిల్లలే" అనే భావనతో అంకితభావంతో పనిచేసి అక్కడి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

### అసాంఘిక శక్తుల నుంచి రక్షణ.. ఆరోగ్య శిబిరాలు

స్కూళ్లు అందుబాటులో లేక దూర ప్రాంతాలకు వెళ్లలేక పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారని, వారు అసాంఘిక శక్తుల చేతుల్లో చిక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పించాలని సూచించారు. జవహార్ నగర్ లోని దుస్థితిని తులసీ చందు తన యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి తెలియజేశారని గుర్తు చేశారు. యుద్ధ ప్రాతిపదికన అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. బాల్య వివాహాలు, డ్రాపౌట్ వంటి సమస్యలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.

# కలెక్టర్ చేతుల మీదుగా 'సురక్షిత మాతృత్వం' ప్రారంభం!

- గర్భిణీల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం

**కామారెడ్డి, ఏప్రిల్ 8 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో 'సురక్షిత మాతృత్వం' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణే రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య, ప్రసూతి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు గర్భిణీలను గుర్తించి వారికి అవసరమైన పరీక్షలు, పోషకాహారం, టీకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

### సురక్షిత ప్రసవాలపై అవగాహన సదస్సు

ఈ సందర్భంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో గర్భిణీలు




తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నిపుణులైన వైద్యులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రసవానికి ముందు, తర్వాత ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణ మార్గాలను వివరించారు. సురక్షిత ప్రసవం కోసం ఆసుపత్రుల్లోనే డెలివరీ జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవీందర్, వైద్య శాఖ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సమాజంలో మాతృత్వంపై అవగాహన పెంచడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# పోరాటాల పార్టీ సీపీఐకి అండగా నిలవండి

### జాఫర్ గూడాలో ఇంటింటికి సీపీఐ
### సామూహికంగా విరాళాల సేకరణ



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 8 :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం జాఫర్ గూడా కాలనీ శాఖ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టింది. ప్రజా పక్షాన పోరాడే పార్టీకి ప్రజలందరూ చేయూతనివ్వాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా కాలనీలో సామూహికంగా విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ పాల్గొన్నారు. మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మ, శాఖ కార్యదర్శి సైదులు ముదిరాజ్, ఆవుల యాదగిరి, మధు, నరసింగం సుధాకర్, భూక్యా క్రాంతి, వినోద్ నాయక్, మండల కౌన్సిల్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని పార్టీకి తమ మద్దతు తెలిపారు.

# కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణం

### మంత్రి ఉత్తమ్‌కు గజ్జి భాస్కర్ యాదవ్ విన్నపం
### చెరువుల అభివృద్ధిపై మంత్రి సానుకూల స్పందన
### తక్షణమే నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

**ఎల్బీనగర్, ఏప్రిల్ 8 :** ఉమ్మడి హయత్ నగర్ లోని బాతుల చెరువు, కుమ్మరి కుంటల



అభివృద్ధి కోసం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ కలిశారు. ఎల్బీనగర్ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ భేటీలో వివిధ కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. ముఖ్యంగా కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. గజ్జి భాస్కర్ యాదవ్ విన్నపంపై మంత్రి వెంటనే స్పందించారు. సంబంధిత ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్. రెడ్డితో ఈ విషయంపై మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సచివాలయంలో చీఫ్ ఇంజనీర్ ను కలిసిన భాస్కర్ యాదవ్.. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎండోర్స్ చేసిన లేఖను అందజేశారు. దీనిపై స్పందించిన చీఫ్ ఇంజనీర్.. వెంటనే ఆయా చెరువులను సందర్శించి పూర్తి నివేదిక ఇవ్వాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ముల్కనూర్ పీఎస్‌లో సీపీ తనిఖీ!

### రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి
### డ్రగ్స్, సైబర్ నేరాలపై కఠినంగా ఉండాలని ఆదేశం

**ముల్కనూర్, ఏప్రిల్ 8 :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం



ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి.. పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని.. గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్.. గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది తరచుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ రాజు పాల్గొన్నారు. ముల్కనూర్ పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సీపీ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

## బజార్ హత్నూర్ సభలో సీఎం హీరాపూర్ ప్రస్తావన



**ఆదిలాబాద్:** బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి బాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గతంలో తాను మళ్లీ హీరాపూర్ గ్రామానికి వస్తానని మాజీ ఎంపీ సోయం బాపురావుకు ఇచ్చిన మాటను సభలో గుర్తు చేశారు. దీనిపై హీరాపూర్ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఆదిలాబాద్‌లోని మాజీ ఎంపీ సోయం బాపురావును ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి హీరాపూర్ గ్రామాన్ని సందర్శిస్తే గ్రామానికి పలు అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హీరాపూర్ గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఒకరి అదృశ్యం



**గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండలం మన్నూరు గ్రామానికి చెందిన కదం శ్యాంసుందర్ గత కొన్ని రోజులుగా అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆయన కోసం బంధువులు, గ్రామస్థులు అన్ని చోట్ల వెతుకుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యాంసుందర్ పనిమీద వికారాబాద్ జిల్లా తాండూరు మండలానికి వెళ్లి, అక్కడి నుంచి మార్చి 23న ఇంటికి వస్తున్నానని చెప్పి బయలుదేరినప్పటికి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఆచూకీ లభిస్తే సెల్: 9705197452, 9391237454, 6300135954, 8008489125లపై సమాచారం అందించాలని కోరుతున్నారు.

## పౌష్టికహారంతోనే ఆరోగ్యం



**నేరడిగొండ:** గర్భిణీలు క్రమం తప్పకుండ పౌష్టికహారం తీసుకుంటెనే రక్తహీనత రాకుండా ఆరోగ్యంగా ఉంటారని నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ–1 కేంద్రంలో సురిక్షిత మాతృత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం కోసం తీసుకునే జాగ్రత్తలు, అంగన్వాడీ కేంద్రాల సేవల పట్ల మహిళలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ చేపట్టే పనుల గురుంచి వివరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామస్తాయి బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో బాల్య వివాహలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన బాలికలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే కమిటీ దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో మొక్కజొన్న పంట దగ్ధం



**నేరడిగొండ:** మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కడారి రాములు అనే రైతు తనకున్న ఎకరన్నర భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. తన చేనులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి మొక్కజొన్న పంటలో వ్యాపించాయి. దీంతో దాదాపు 15 క్వింటాళ్ల మొక్కజొన్న కాలి బూడిదైనట్లు బాధిత రైతు, గ్రామస్తులు తెలిపారు. వాటి విలువ పంట రూ.40వేలు ఉంటుందని, కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చిన సమయంలో ఇలా కాలి బూడిదవ్వటంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

# తల్లి ఆరోగ్యం సమాజ అభివృద్ధికి కీలకం

### ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్:** తల్లి ఆరోగ్యం సురక్షితంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం అవుతుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లోని సీకేఎం మెటర్నిటీ ఆసుపత్రిలో బుధవారం "సేఫ్ మదర్స్ డే" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవితో కలిసి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే నాగరాజు ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ గర్భిణీలనువారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు అవసరమైన వైద్య సదుపాయాలు అందుతున్నాయా అనే అంశంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లి ఆరోగ్యం సురక్షితంగా ఉండడం సమాజ అభివృద్ధికి అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రతి గర్భిణీకు సురక్షిత ప్రసవం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గర్భధారణ సమయంలో మహిళలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పాటిస్తూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షలు, మందులు, ఇతర సదుపాయాలను తప్పకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అవసరమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణీల ఆహారం, విశ్రాంతి, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాదని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, శిశు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీకేఎం మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, గర్భిణీలు, తల్లులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 25 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



**ములుగు:** రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ములుగు మండలం మదనపల్లి గ్రామంలో బుధవారం 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మదనపల్లి గ్రామ సర్పంచ్ నేత కరుణసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, మాజీ సర్పంచ్ జన్ను రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్ యాదవ్, మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎండీ ఖుతుబుద్దిన్, ములుగు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్ చారి, నాయకులు గండ్రత్ జయాకర్, విజయ్ యాదవ్, గ్రామ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- 'ఫుడ్ సేఫ్టీ వాకథాన్' ప్రారంభించిన అదనపు కలెక్టర్ రాజేశ్వర్



**ఆదిలాబాద్:** ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఆహర భద్రత శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించిన వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాదించగలమని సూచించారు. ప్రస్తుత తరుణంలో తీసుకునే ఆహారంలో రసాయనాల వాడకం ఎక్కువైందని, దీంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ఆహారం, నిద్ర సరైన సమయానికి తీసుకోవాలని పేర్కొన్నారు. సరైన ఆహారం తీసుకుందాం– ఆరోగ్యంగా ఉందాం" అనే నినాదంతో ప్రజలు తమ ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి ఫుడ్ లైసెన్స్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆహార భద్రత అధికారి ప్రత్యూష, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ నాయక్, వైద్యులు దీపక్ పుష్కర్, నరేందర్, ఇతర అధికారులు, అంగన్వాడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు రెండు కొత్త సబ్ స్టేషన్లు మంజూరు



**సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో మరో రెండు కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు ఎన్పీడీసీఎల్ సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి తెలిపారు. తంగళ్ళపల్లి మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో ఒక సబ్ స్టేషన్ మంజూరైందని, నిర్మాణం పూర్తయిన అనంతరం పాపయ్యపల్లి గ్రామంతో పాటు తాడూర్, గోపాల్‌రావుపల్లి, బెంద్రంపల్లి గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా గంభీరావుపేట మండలంలోని భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో మరో సబ్ స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా మల్లారెడ్డిపేటతో పాటు శ్రీగాద, కోళ్లమద్ది తదితర పరిసర గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని వివరించారు. ఈ రెండు సబ్ స్టేషన్ల నిర్మాణానికి సుమారు రూ.7 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించాలి



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. రామానగరం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మహాలక్ష్మి కి సీపీఐ పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామంలో కూలీ పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారందరికీ ఉపాధిహామీ పథకం కింద తక్షణమే పనులు కల్పించాలని కోరారు. అదేవిధంగా రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని, సంవత్సరానికి కనీసం 200 రోజుల పనులు కల్పించాలని, రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో పనులు కల్పించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇంకా గ్రామంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మరణించడంతో గత రెండు సంవత్సరాలుగా ఆ పోస్టు ఖాళీగా ఉందని, వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి తండు జగన్, లక్ష్మీకాంత్, పిల్లి నాగమణి, మరియమ్మ, పట్టకోయి సీత, రాధా, రాములమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్

- శరవేగంగా పనులు.. ఇప్పటిదాకా 40 శాతం పూర్తి
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.161 కోట్లకుపైగా సాయం జమ
- వేడుకగా గృహ ప్రవేశాలు





**సిరిసిల్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు 40 శాతం పూర్తి చేసి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆత్మగౌరవ ప్రతీక సాకారం దిశగా ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లబ్దిదారులకు ప్రజా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోంది. ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా రూ.161 కోట్లకు పైగా ఆర్థిక సహాయం జమ చేసి.. రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాల వేడుకలు సాగుతున్నాయి. సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతిఒక్కరి చిరకాల స్వప్నం. ఆ కల సాకారానికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడుతల్లో అందజేస్తుంది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత రూ.లక్ష, గోడలు నిర్మిస్తే రూ.లక్ష, స్లాబ్ నిర్మించిన తర్వాత రూ.2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**ప్రజా ప్రభుత్వం సహకారం..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో పెట్టి ఉచితంగా అందిస్తుంది. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల పరిధిలో వార్డ్ ఆఫీసర్లు తమ తహశీల్దార్ దృష్టికి ముందస్తుగా తీసుకెళ్లాలి. ఇసుక ఉచితం.. రవాణా ఛార్జీలు నిర్మాణదారులు చెల్లించాల్సి ఉంటుంది. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా ద్వారా రూ.లక్ష రుణం అందించే ఏర్పాట్లు చేసింది.

**నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మోడల్ హౌస్ లు..**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 11 మండలాల్లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండా కాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. నాణ్యతలో కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.

**40 శాతం ఇండ్లు పూర్తి ..**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు 3,570 స్లాబ్ లెవెల్ లో ఉండగా, 1,419 పూర్తి కాగా, ఇంకా 2,151 ఇండ్లు తుది దశలో ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటి దాకా జిల్లాలో మొత్తం రూ.161 కోట్ల 22 లక్షల ఆర్థిక సహాయం లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**శరవేగంగా పూర్తి చేసేలా ..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ శరవేగంగా పూర్తి చేసేలా పకడ్బందీగా సలహాలు, సూచనలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులతో ఇంటి నిర్మాణ సామాగ్రి, భవన నిర్మాణ కార్మికులు, వడ్రంగి, విద్యుత్ సేవలు అందించే వారితో సమావేశాలు ఏర్పాటు చేయించి, వారి ఫోన్ నెంబర్లు, వివరాలను లబ్దిదారులకు అందుబాటులో పెడుతున్నారు. లబ్దిదారులు ఇండ్లు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

**నెరవేరిన 20 ఏండ్ల కల..**

కోడూరి రజిత, ఉప్పుగడ్డ, వేములవాడ పట్టణం

నాకు సొంత ఇల్లు లేదు. 20 సంవత్సరాలుగా వేములవాడ పట్టణంలో నివాసం ఉంటున్న. సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డ. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. నా ఇల్లు పూర్తి అయ్యింది. ఎంతో సంతోషంగా ఉంది. నా కల సాకారానికి సహకారం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ లకు కృతజ్ఞతలు.

**సద్వినియోగం చేసుకోవాలి**

– వెంకట మాధవరావు, పీడీ హౌసింగ్

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారు తమ సమీపంలోని హౌసింగ్ అధికారులను సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలోనే ఇల్లు పూర్తి చేసుకునేలా జిల్లాలో మా శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లు నిర్మించాం. నేరుగా సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చు.

# బెజ్జూర్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ఆసుపత్రి, పాఠశాలలు, తహశీల్దార్ కార్యాలయం తనిఖీ




**బెజ్జూర్:** జిల్లా కలెక్టర్ కె.హరిత బుధవారం బెజ్జూర్ మండలంలో పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు స్నేహపూర్వకంగా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వేసవి కాలం నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీలకు ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిపోల్చి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి, తహశీల్దార్ రామ్మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి మిసరి వైకుంఠం, ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జోగు రామన్నపై బాలురి గోవర్ధన్ రెడ్డి ఫైర్



**ఆదిలాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శల నేపథ్యంలో మాజీ మంత్రి జోగు రామన్నపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బాలురి గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎప్పుడైనా పార్టీ మారాలనుకున్నప్పుడు ఆ పార్టీపై విమర్శలు చేయడం జోగు రామన్నకు అలవాటైపోయిందని అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. గతంలో టిడిపి నుంచి టీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేసి, తర్వాత అదే పార్టీలో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సీఎం రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే జోగు రామన్న ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఆయన చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. 2013లో అప్పటి కలెక్టర్ అహ్మద్ బాబు ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం సుమారు 1500 ఎకరాల స్థలాన్ని గుర్తించినప్పటికీ, అప్పట్లో మంత్రిగా ఉన్న జోగు రామన్న, ఎంపీ నగేష్‌లు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. 2018లో కొరట–చనాక ప్రాజెక్టు వద్ద భూ నిర్వాసితులకు ఇండ్లు మంజూరు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ, మంత్రిగా ఉన్న జోగు రామన్న ఒక్క ఇంటినైనా నిర్మించారా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే భూ నిర్వాసితుల కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో రూ.1100 కోట్లతో మైనార్టీ పాఠశాలల నిర్మాణం ప్రారంభించగా, అందులో రూ.600 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్న విషయంపై జోగు రామన్న స్పందించాలని డిమాండ్ చేశారు. తన ఆరోపణలపై మాజీ మంత్రి జోగు రామన్న శ్వేతపత్రం విడుదల చేయాలని, సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుధాకర్ గౌడ్, కొండూరి రవి, సంజయ్, బీడీ చారి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు సమయం కేటాయించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** వైద్య వృత్తి సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్‌లతో కలిసి వైద్య విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని, దీంతో మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించడం అవసరమని అన్నారు. విద్యార్థుల క్షేత్ర పర్యటనలు, ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల సందర్శన, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాల కోసం ప్రభుత్వం మూడు బస్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ బస్సులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 నుంచి 15 సంవత్సరాల వరకు ఉపయోగంలో ఉంటాయని చెప్పారు. వైద్య విద్యార్థులు ప్రత్యేక విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం క్రీడా సామాగ్రిని అందించిందని, వైద్య విద్యతో పాటు క్రీడలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా చదువుపై మరింత ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**తాండూర్:** మండలంలోని గోపాల్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య, ఉప సర్పంచ్ గాజుల సునీత ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పిల్లల ఎత్తు, బరువులను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.సౌందర్య, అంగన్వాడీ టీచర్లు కంబాల శోభ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

**సత్తుపల్లి:** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ ఇంచార్జ్



దైద రవీంద్ర అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18న తాండూర్‌లో హిందూ మహా సమ్మేళనం

**తాండూర్:** మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18న తాండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో హిందూ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహా సమ్మేళన కార్యక్రమానికి తాండూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ రోజు వ్యక్తిగత పనులను కొంత కాలం పక్కన పెట్టి కార్యక్రమానికి పూర్తి సమయం కేటాయించాలని కోరారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు కిష్టంపేట హనుమాన్ మందిరం నుంచి భారీ శోభయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శోభయాత్ర, మహా సమ్మేళనంలో ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పెద్దిన్ని సత్యం ఆశయాల సాధన కోసం పని చేస్తాం

**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం



గ్రామంలో బుధవారం అమరజీవి కామ్రేడ్ పెద్దిన్ని సత్యం 33వ వర్ధంతి సందర్భంగా సభ నిర్వహించారు. గ్రామ సీపీఎం శాఖ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ పెద్దిన్ని సత్యం ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. నేటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీలకతీతంగా ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సభ గ్రామ సీపీఎం శాఖ కార్యదర్శి కొత్తా అప్పారావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం డివిజన్ నాయకులు రావుల రాజబాబు, సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, పెద్దిన్ని సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి వెంకటేశ్వరరావు, మల్లూరు చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ ఎర్రా రమేష్, ఎర్రా సత్యనారాయణ, సింగపోగు కేశవరావు, రాయల చెన్నారావు, సుజాత, బేతినీ చెన్నయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమొబైల్స్ ప్రారంభోత్సవంలో బోరంచు



**ఆదిలాబాద్:** నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ ఆటోమొబైల్స్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్, మాజీ జెడ్పిటిసి రాజేశ్వర్ రెడ్డితో కలిసి షాప్‌ను ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా కొత్త వ్యాపారాలు ప్రారంభం కావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రావు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మాత శిశు సంరక్షణకు ప్రభుత్వం కృషి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయడం ద్వారా మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్ఎంఓ శ్రీధర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు చర్యలు చేపడుతోందన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. శుద్ధమైన తాగునీరు, పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీల వివరాలు నమోదు చేసి సమయానుసారంగా వైద్య పరీక్షలు, ఆహార నియమాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. జిల్లాలో ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రులు, పల్లె దవాఖానాలు, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం మాతా శిశు ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో వరద నీటి సమస్య ఉన్నందున త్వరలో పూర్తి కానున్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చెన్నూర్ మండల కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.129.25 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్ టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పటిష్ట చర్యలు అమలు చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని రహదారులపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, రహదారులపై అనధికార వాహన నిలుపుదలపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్కువ విజిబిలిటీ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, అధిక వేగంతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేసేలా కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులపై కూడా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్రాక్టర్ల కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాలు గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రోడ్డు భద్రతపై ప్రతి మండలం, గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించడం, కల్వర్టుల వద్ద సూచికలు ఏర్పాటు చేయడం, పట్టణాలు, గ్రామాల్లో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్ :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోద్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చి 50 పడకల నుండి 330 పడకలకు ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంపొందించడం జరిగిందని, తదనుగుణంగా సిబ్బంది నియామకం, వైద్య పరికరాలను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిపుణులను నియమించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తద్వారా ఆసుపత్రికి వచ్చే ప్రజల సంఖ్య పెరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రికి వచ్చే నిధులతో అత్యవసర మందులు, ఆక్సిజన్, ఇతర పరికరాల కొనుగోలుకు వినియోగించడం జరుగుతుందని, ఇతర అవసరాలకు కావలసిన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఖాళీ స్థలన్ని పార్కింగ్ కొరకు కేటాయించాలని, ఆసుపత్రి ఆవరణలోని ప్రాంతాన్ని ప్రైవేట్ మెడికల్ షాప్ జిరాక్స్, క్యాంటీన్, ఇతరత్రా ఏర్పాటు చేసుకునేందుకు నిబంధనల ప్రకారం అనుమతించాలని, తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మార్చురీ వ్యాన్, అంబులెన్స్ కొరకు, ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నందున అవసరమైన ఆపరేషన్ థియేటర్, పరికరాలు, సిబ్బంది నియామకం కొరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కమిటీ సభ్యులు ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాలకు మేమున్నాం

### భరోసా కల్పించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

**సిద్దిపేట:** కష్టాల్లో ఉన్న జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవడంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజే – ఐజేయు ) ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను, మాతృమూర్తులను కోల్పోయిన జర్నలిస్టులను బుధవారం ఆయన స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పారు.

**ప్రజా గాయకుడు జహంగీర్ కుటుంబానికి పరామర్శ**

తొలుత యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా గాయకుడు జహంగీర్ కుటుంబాన్ని విరాహత్ అలీ సందర్శించారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు.



**బాధిత జర్నలిస్టులకు నైతిక మద్దతు**

అనంతరం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామానికి చేరుకుని, ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డిని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే రాయపోలు మండలం అనాజీపూర్ గ్రామంలో తల్లిని కోల్పోయిన సాక్షి విలేకరి నాగ వెంకట్ రెడ్డిని పరామర్శించి, వారి కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**జర్నలిస్టు సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం**

మూడు రోజుల క్రితం గుండెపోటుతో అకాల మరణం చెందిన సియాసత్ ఉర్దూ దినపత్రిక గజ్వేల్ సీనియర్ జర్నలిస్టు ఎక్బాల్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎక్బాల్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి తక్షణమే ఆర్థిక సహకారం అందేలా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా విరాహత్ అలీ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట పలువురు యూనియన్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలి

- **జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు**

**ఆసిఫాబాద్ టౌన్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులను వేగవంతం చేసేందుకు ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి బుచ్చన్న లతో కలిసి జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో గల క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో పనిచేసే ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాలలోని కూలీలకు ఉపాధి కల్పించాలని, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 100 మందికి పైగా కూలీలు పనిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీల హాజరును పక్కాగా నమోదు చేయాలని, ఎలాంటి అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూలీలను చైతన్య పరచి పనులు కల్పించడంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో లక్ష్యానికి అనుగుణంగా కూలీల సంఖ్య పెంపొందించి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని తెలిపారు. కూలీల సంఖ్య పెంపొందించడం ద్వారా ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వృత్తి విద్యా కోర్సుల శిక్షణ ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్:** నేటి పోటీ ప్రపంచంలో పుస్తక పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్ నైపుణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ శ్రీ అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మార్చి 30 నుండి ఏప్రిల్ 10 వరకు వృత్తి విద్యా కోర్సులపై ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని 'మన కంప్యూటర్ రొమ్స్ ఇన్ఫోటెక్'లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించడం వల్ల విద్యార్థినులకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, అధ్యాపకులు స్రవంతి, మయూరి, భద్రకాళి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




## బుద్ధ జయంతిని అధికారికంగా నిర్వహించాలి


**కాగజ్నగర్:** మే 1న జరిగే తథాగత్ గౌతమ బుద్ధుని 2570వ బుద్ధ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ శాఖల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, తాలూకా అధ్యక్షుడు కొండగుర్లె దేవాజీ, ప్రధాన కార్యదర్శి కొండగుర్లె గణపతి మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన గౌతమ బుద్ధుని జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. భారత దేశంలోని 15 రాష్ట్రాల్లో బుద్ధ జయంతి సందర్భంగా సాధారణ సెలవు ఇస్తున్నారని, తెలంగాణలో కూడా అదే విధంగా సెలవు ప్రకటించి బౌద్ధ పూర్ణిమను ఘనంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగజీవన్ రామ్, సేవాలాల్, కొమరం భీమ్ వంటి మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రపంచానికి శాంతి మార్గం చూపిన గౌతమ బుద్ధుని జయంతిని కూడా అధికారికంగా జరపాలని కోరారు. అలాగే కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బుద్ధ విహార్ లో పూజలు నిర్వహించే బౌద్ధాచార్యులకు గౌరవ వేతనం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం విక్రమ్, పిత్ర ప్రభాకర్, దుర్గం మాధవ్, ముర్మాడే నరసయ్య, దుర్గం వెంకటేష్, మానపల్లి ప్రభాకర్, కొండగుర్లే మారుతి, దుర్గం పుండలిక్, దుర్గం రామచందర్, ఎం.శివకుమార్, దుప్త సూర్యకుమార్, రౌతు దేవాజీ తదితరులు పాల్గొన్నారు.



# ఎక్కువ శాతం మందికి బాత్ రూమ్‌లోనే ఎందుకు హార్ట్ ఎటాక్‌లు వస్తాయి..?

## అలా జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి..?

నిత్యం ఉరుకుల పరుగుల బిజీ జీవితం కారణంగా చాలా మంది రోజూ అనేక సందర్భాల్లో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ కారణంగా చాలా మంది గుండె పోటుతో అకస్మాత్తుగా మృతి చెందుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మంది గుండె జబ్బుల కారణంగా మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఎక్కువ శాతం మందికి హార్ట్ ఎటాక్ వస్తుండగా, అది కూడా వారు బాత్ రూమ్‌లో ఉండగానే అలా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలా మందికి బాత్ రూమ్‌లలోనే హార్ట్ ఎటాక్ వస్తుందని అంటున్నారు. అయితే దీని వెనుక బలమైన కారణాలే ఉంటున్నాయని, వీటిని గమనించి జాగ్రత్తగా ఉంటే హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



**కారణాలు ఇవే..**

సాధారణంగా బాత్ రూమ్‌లో మల విసర్జన చేసినప్పుడు లేదా మూత్ర విసర్జన చేసినప్పుడు శరీరంపై కొన్నిసార్లు ఒత్తిడి బాగా పడుతుంది. అయితే అలాంటప్పుడు గుండె కొట్టుకునే వేగంలో మార్పులు వస్తాయి. దీని వల్ల ఒక్కసారిగా గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ వస్తుంది. బాత్‌రూమ్‌లో హార్ట్ ఎటాక్ వచ్చేందుకు ఇదొక కారణంగా చెప్పవచ్చు. అలాగే కొందరు మలం లేదా మూత్ర విసర్జన చేసేటప్పుడు శరీరంపై బాగా ఒత్తిడిని కలగజేస్తారు. మల విసర్జన చేసినప్పుడు బాగా ఒత్తిడితో చేస్తారు. అలాగే ఎక్కువ సేపు మూత్రాన్ని ఆపుకున్నా కూడా విసర్జించేటప్పుడు బాగా ఒత్తిడిని కలగజేస్తారు. దీని వల్ల వేగస్ నాడిపై ఒత్తిడి పడి భారం పెరుగుతుంది. ఇది గుండె కొట్టుకునే వేగాన్ని గణనీయంగా పెంచుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ సంభవిస్తుంది.

**ఇవి కూడా కారణమవుతాయి..**

ఇక కొందరు మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉండే నీటితో స్నానం చేస్తుంటారు. ఇలా చేయడం మంచిది కాదు. దీనివల్ల శరీర ఉష్ణోగ్రతలో ఒక్కసారిగా భారీ మార్పులు వస్తాయి. దీని వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది హార్ట్ ఎటాక్‌కు కారణమవుతుంది. కనుక ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు గాను గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. అలాగే కొందరు బెడ్ మీద నుంచి లేచి వెంటనే హడావిడిగా బాత్‌రూమ్‌కు పరుగెత్తుతారు. కానీ ఇలా చేయడం వల్ల ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. దీని వల్ల కూడా గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఫలితంగా అది హార్ట్ ఎటాక్ కు దారి తీస్తుంది. కనుక బెడ్ మీద నుంచి లేచిన తరువాత వెంటనే కిందకు దిగకూడదు. నెమ్మదిగా పనులు చేసుకోవాలి. దీంతో హార్ట్ ఎటాక్ లు రాకుండా నివారించవచ్చు.

**ఈ విధంగా చేయండి..**

బాత్ రూమ్‌లో మూత్రం లేదా మల విసర్జన చేసేటప్పుడు ఎక్కువ ఒత్తిడి కలగజేయకూడదు. అలాగే మలం, మూత్రాన్ని ఎక్కువ సేపు బంధించకూడదు. ఇది గుండెపై భారం పడేయడం మాత్రమే కాదు, కిడ్నీలపై కూడా భారం కలిగేలా చేస్తుంది. దీని వల్ల మూత్రాశయ వ్యవస్థ కూడా దెబ్బ తింటుంది. కనుక మలమూత్రాలను ఎక్కువ సమయంపాటు బంధించి ఉంచకూడదు. అలాగే స్నానం చేసేటప్పుడు కాస్త గోరు వెచ్చగా ఉన్న నీటితోనే స్నానం చేయాలి. మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉన్న నీళ్లను స్నానానికి ఉపయోగించకూడదు. అలాగే తలస్నానం చేసేటప్పుడు ముందుగా నీళ్లను తలపై కాకుండా కొన్ని నీళ్లను పాదాలపై పోసుకోవాలి. తరువాత నీళ్లను తలపై పోసుకుని స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల బాత్ రూమ్‌లో హార్ట్ ఎటాక్‌లు రాకుండా అడ్డుకోవచ్చు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# రాత్రి పూట నిద్రలో దంతాలను కొరుకుతున్నారా..?

## అయితే అలా ఎందుకు చేస్తారు..? దాన్ని ఎలా తగ్గించుకోవాలి..?



చాలా మంది నిద్రించేటప్పుడు వివిధ రకాల భంగిమల్లో బెడ్‌పై పడుకుంటారు. గాఢ నిద్రలో ఉన్నా కూడా రకరకాల భంగిమల్లో నిద్రిస్తుంటారు. ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు అలా చేస్తారు. అయితే కొందరు నిద్రలో ఉన్నప్పుడు దంతాలను కొరుకుతారు. ముఖ్యంగా పిల్లలు ఈ విధంగా ఎక్కువగా చేస్తారు. దీని వల్ల వారు నిద్రించేటప్పుడు దంతాలను కొరికితే ఆ శబ్దం బయటకు వినిపిస్తుంది. కానీ పిల్లలు లేదా పెద్దలు ఎవరైనా సరే దంతాలను కొరికితే అలా చేస్తున్నట్లు వారికి తెలియదు. కానీ పక్కన ఉన్న వారికి మాత్రం ఆ శబ్దం స్పష్టంగా వినిపిస్తుంది. అయితే ఎవరైనా ఇలా ఎందుకు చేస్తారు.. అనే విషయంపై ఇప్పటికీ వైద్య నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కానీ ఇందుకు పలు కారణాలు ఉంటాయని మాత్రం వారు చెబుతున్నారు.

**పెద్దలు, పిల్లలు..**

సాధారణంగా పెద్దల్లో ప్రస్తుతం ఆందోళన, ఒత్తిడి, కోపం, నిరాశ, ఉద్రిక్తత అధికంగా ఉంటున్నాయి. అందుకు అనేక అంశాలు కారణం అవుతున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నవారు నిద్రలో దంతాలను అధికంగా కొరుకుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే మానసిక సమస్యలు మరీ తీవ్రంగా ఉన్నవారు కూడా నిద్రలో ఇలాగే చేస్తారని అంటున్నారు. ఇక చిన్నారులు మాత్రం దంతాలను కొరికేందుకు వేరే కారణాలు ఉంటాయి. చిన్నారుల పేగులు లేదా జీర్ణాశయంలో పురుగులు ఎక్కువగా ఉన్నా, వారిలో క్యాల్షియం, మెగ్నిషియం వంటి లోపాలు ఉన్నా అలాంటి వారు నిద్రలో దంతాలను కొరుకుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. కనుక చిన్నారులకు ఈ సమస్య తగ్గేందుకు గాను వారికి రోజూ పౌష్టికాహారం ఇస్తే సరిపోతుంది. అదే వారి జీర్ణవ్యవస్థలో పురుగులు ఉంటే మాత్రం వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది.

**వీటిని తినాలి..**

నిద్రలో దంతాలను కొరికే పెద్దలకు ప్రత్యేకంగా చికిత్స అంటూ ఏమీ ఉండదు. కానీ ఈ సమస్యకు కారణం అయ్యే అంశాల పట్ల దృష్టి సారించాల్సి ఉంటుంది. అంటే వారికి ఉండే ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. దీని వల్ల నిద్రలో దంతాలను కొరికే సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే మెగ్నిషియం అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. మెగ్నిషియం మనకు ఎక్కువగా పొద్దు తిరుగుడు విత్తనాలు, గుమ్మడి విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్, బాదంపప్పు, నువ్వులు, ఓట్స్, జీడిపప్పు, పిస్తా, పల్లీలు, అరటి పండ్లు వంటి ఆహారాల్లో లభిస్తుంది. కనుక వీటిని తరచూ తింటే మెగ్నిషియం సమృద్ధిగా లభించి ఆ సమస్య తగ్గుతుంది.

**ఈ చిట్కాలు కూడా పనిచేస్తాయి..**

ఇక నిద్రలో దంతాలను కొరికే సమస్య ఉన్నవారు రాత్రి పూట పాలలో పసుపు లేదా మిరియాల పొడి కలిపి తాగుతుంటే ఉపయోగం ఉంటుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొందరు రాత్రి పూట చలికి వణికినట్లు ఫీలవుతారు. అలాగే చలికాలంలోనూ అలాంటి వారికి రాత్రి పూట వణుకు ఉంటుంది. ఈ కారణంగా కూడా కొందరు నిద్రలో దంతాలను కొరుకుతారని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కనుక చుట్టూ ఉండే పరిసరాలను వేడిగా ఉంచుకోవాలి.

ఇందుకు అవసరం అయితే రూమ్ హీటర్లను వాడవచ్చు. లేదా శరీరాన్ని వెచ్చగా ఉంచే ఆహారాలను తినాలి. అలాగే రోజుకు 2 సార్లు ఏవైనా హెర్బల్ టీలను తాగుతున్నా ఉపయోగం ఉంటుంది. దీంతోపాటు యోగా, ధ్యానం వంటివి అనుసరించినా కూడా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

# రోజులో డ్రై ఫ్రూట్స్ ను అసలు ఏ సమయంలో తినాలి..?

## ఎప్పుడు వీటిని తింటే మనకు ఎక్కువ మేలు జరుగుతుంది..?

మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

**ఏ సమయంలో తినాలి..?**

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రోజంతా యాక్టివ్‌గా..**

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

**ఇలా కూడా చేయవచ్చు..**

అయితే ఉదయం పూట డ్రై ఫ్రూట్స్ ను తినేంత సమయం లేదని భావిస్తే వాటిని మీరు బాక్స్ లో పెట్టుకుని ఆఫీస్‌కు తీసుకెళ్లి తరువాత తినవచ్చు. ఇక అలా కూడా వీలు కావడం లేదని అనుకుంటే సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తినాలి. కానీ ఆ సమయంలో మనకు పెద్దగా శక్తి అవసరం ఉండదు. కనుక డ్రై ఫ్రూట్స్ ను మోతాదుకు కాస్త తక్కువగా తినాలి. ఇలా డ్రై ఫ్రూట్స్ ను తింటే మన శరీరంలో శక్తి స్థాయిలు ఎల్లప్పుడూ అధికంగానే ఉంటాయి. దీంతో నీరసం, అలసట అసలు రావు. ఉత్సాహంగా ఉండి చురుగ్గా పనిచేస్తారు. డ్రై ఫ్రూట్స్ ను ఇలా తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.





# పాలక్, ముకేశ్‌కు స్వర్ణం

## ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ బోణీ

**గ్రానాడ (స్పెయిన్) :** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ తొలిరోజే శుభారంభం చేసింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత యువ షూటర్లు పాలక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముకేశ్ పసిడి గురిపెట్టారు. ఫైనల్‌లో భారత ద్వయం 487.7 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం గెలుచుకోగా చైనా (484.8)కు రజతం, హంగేరి (414.9) కాంస్యం దక్కించుకున్నాయి. క్వాలిఫికేషన్ రౌండ్‌లో చైనా ద్వయం క్వియాంజు యావొ, కై హు (586)తో పోటీపడి 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జోడీ.. ఫైనల్‌లో మాత్రం సత్తాచాటింది. పాలక్, ముకేశ్ ప్రదర్శన జూనియర్ స్థాయిలో రికార్డు కావడం గమనార్హం.




# ఫైనల్‌కు మీనాక్షి, జైస్మీన్..

## పురుషుల విభాగంలో మరో ఇద్దరు

**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** భారత యువ బాక్సర్లు మీనాక్షి హుడా, జైస్మీన్ లంబోరియా ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సెమీస్ బౌట్‌లలో ఈ ఇద్దరూ జోరును కొనసాగిస్తూ ప్రత్యర్థులను చిత్తు చేసి పసిడి పోరుకు అర్హత సాధించగా మెన్స్ క్యాటగిరీలోనూ విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ కూడా ఫైనల్ చేరారు. మహిళల 48 కిలలో సెమీస్‌లో మీనాక్షి.. 4–1తో తిప్సచ యొద్వరీ (థాయ్‌లాండ్)ని ఓడించగా జైస్మీన్ (57 కి.) 3–2తో నిగిన ఉక్తమొవ (ఉజ్బెకిస్థాన్)పై పోరాడి గెలిచింది. పురుషుల 60 కి. సెమీస్‌లో సచిన్.. 4–1తో సక్ద రౌమ్తుమ్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేయగా విశ్వనాథ్ (50 కి.) వరల్డ్ చాంపియన్, ప్రపంచ మొదటి ర్యాంకర్ అయిన కజకిస్థాన్ బాక్సర్ తష్కెంబెపై 5–0తో ఏకపక్ష విజయాన్ని నమోదుచేశాడు. తాజా ప్రదర్శనలతో ఈ టోర్నీలో ఫైనల్ చేరిన బాక్సర్ల సంఖ్య 8 (ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు)కు చేరింది. ఇదిలాఉండగా ఆకాశ్ (75 కి.), లోకేశ్ (85 కి.), నరేందర్ (90+ కి.), హర్ష్ చౌదరి (90 కి.) సెమీస్ బౌట్‌లలో ఓడి కాంస్య పతకంతో సంతృప్తి పడ్డారు.

# స్మృతి మంధాన పెళ్లిపై కొత్త ట్విస్ట్..



**ముంబై:** నవంబర్ 2025లో వైభవంగా జరగాల్సిన స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం అనుకోని కారణాల వల్ల ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా వైరలవుతోన్న వీడియో చూస్తే మాత్రం అంతా షాక్ అవ్వచచచచచచచ ఎందుకంటే, ఈ వీడియో ఇరు కుటుంబాలు కలిసి ఉండడం, ఆప్యాయంగా మాట్లాడుకోవడం చూస్తే గొడవలు సద్దుమణిగాయని, త్వరలో గుడ్ న్యూస్ చెప్పనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ గతంలో పెళ్లి ఆగిపోవడంతో విడిపోయారనుకున్న ఈ జంట గురించి తాజాగా ఒక ఆసక్తికర వీడియో వెలుగులోకి వచ్చింది. రెండు కుటుంబాలు కలిసున్న ఈ దృశ్యాలు చూస్తుంటే వారి మధ్య విభేదాలు తొలగిపోయాయా అనే అనుమానాలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. నిజానికి స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం గత ఏడాది నవంబర్ (2025)లో వైభవంగా జరగాల్సింది. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక, సరిగ్గా పెళ్లికి ఒకరోజు ముందు స్మృతి తండ్రి శ్రీనివాస మంధాన ఆరోగ్యం క్షీణించడంతో వేడుకను వాయిదా వేశారు. అయితే ఆ తర్వాత పలాష్ మరొక అమ్మాయితో సన్నిహితంగా ఉంటూ దొరికిపోయారని, అందుకే స్మృతి ఈ పెళ్లిని రద్దు చేసుకుందనే వార్తలు నెట్టింట విపరీతంగా హల్చల్ చేశాయి. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి కనిపించకపోవడంతో బంధం తెగిపోయిందని అందరూ భావించారు.



# ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం!

## ఆఖరి ఓవర్లో హైడ్రామా.. ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ పరాజయం

**ఢిల్లీ, ఏప్రిల్ 8:** ఐపీఎల్ 14వ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన టీ 20 మజాను అందించింది. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఈ హై స్కోరింగ్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఊపిరి బిగపట్టి చూసేలా సాగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం 1 పరుగు తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఢిల్లీ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అద్భుతంగా ఆడి జట్టును విజయతీరాల దాకా చేర్చినా.. ఆఖరి ఓవర్లో ఆయన తీసుకున్న 1 తప్పుడు నిర్ణయం జట్టుకు ఘోర పరాజయాన్ని మిగిల్చింది.

### గుజరాత్ భారీ స్కోరు..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే చెలరేగి ఆడారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కేవలం 45 బంతుల్లోనే 70 పరుగులు చేసి శుభారంభం అందించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి వీరబాదుడు బాదారు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2 వికెట్లు పడగొట్టగా.. లుంగి ఎన్గిడి, కుల్దీప్ యాదవ్ తలో 1 వికెట్ తీశారు.

### రాహుల్ ఒంటరి పోరాటం.. రషీద్ మ్యాజిక్ స్పెల్

211 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్ పాతుమ్ నిస్సాంక (24 బంతుల్లో 41), కేఎల్ రాహుల్ అద్భుతమైన పునాది వేశారు. ముఖ్యంగా కేఎల్ రాహుల్ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లోనే 92 పరుగులు చేసి సెంచరీకి తృటిలో మిస్సయ్యాడు. రాహుల్ అవుటైన తర్వాత మ్యాచ్ గుజరాత్ వైపు మొగ్గినట్లు కనిపించింది. గుజరాత్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచాడు. ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు, మహ్మద్ సిరాజ్ 1 వికెట్ తీశారు.

### క్లైమాక్స్‌లో మిల్లర్ తప్పిదం..

మ్యాచ్ దాదాపు చేయిజారిపోతున్న దశలో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్ అసాధారణ పోరాట పటిమ కనబరిచాడు. కేవలం 20 బంతుల్లోనే అజేయంగా 41 పరుగులు చేసి ఢిల్లీకి ఆశలు రేపాడు. మ్యాచ్ ఆఖరి ఓవర్ వరకు వెళ్లడంతో స్టేడియంలో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ఆఖరి ఓవర్లో విజయానికి కొద్ది పరుగుల దూరంలో ఉన్న ఢిల్లీకి మిల్లర్ షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ 5వ బంతికి సింగిల్ తీసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ.. మిల్లర్ పరుగు తీయడానికి నిరాకరించాడు. ఆఖరి బంతికి విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను ముగించాలన్న అతివిశ్వాసంతో ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఒకవేళ ఆ బంతికి సింగిల్ తీసి ఉంటే కనీసం స్కోర్లు సమం అయ్యేవి, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసేది. కానీ చివరి బంతికి గుజరాత్ బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఆ బంతి డాట్ అయ్యింది. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులకే పరిమితమైంది. కేవలం 1 పరుగు తేడాతో గుజరాత్ ఊహించని విజయం సాధించింది. ఒంటరి పోరాటంతో జట్టును గెలిపించే దాకా తెచ్చిన మిల్లర్.. చివరి నిమిషంలో చేసిన చిన్న తప్పు ఢిల్లీ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. చేతికందిన విజయాన్ని క్యాపిటల్స్ తృటిలో చేజార్చుకుంది.



**డేవిడ్ మిల్లర్ చేసిన ఆ ఒక్క తప్పే కొంపముంచిందా?**

**రాణించిన కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్**



# అప్పట్లోనే ఒకడు ఉండేవాడు

## 500 సిక్సర్లతో రోహిత్‌శర్మను మించిన హిట్‌మ్యాన్ ఇతను!

క్రికెట్ చరిత్రలో సిక్సర్ల వీరుల గురించి మాట్లాడితే మనకు వెంటనే క్రిస్ గేల్, రోహిత్ శర్మ లేదా షాహిద్ అఫ్రిది వంటి పేర్లు గుర్తొస్తాయి. కానీ, ఏ విధమైన హెల్మెట్లు, అత్యాధునిక బ్యాట్లు లేని కాలంలోనే సిక్సర్లతో స్టేడియాలను హోరెత్తించిన ఒక అరుదైన క్రికెటర్ ఉన్నారని మీకు తెలుసా. ఈ రోజుల్లో భారీ బ్యాట్లు, చిన్న బౌండరీల వల్ల సిక్సర్లు కొట్టడం సులభం అవుతుంది. కానీ 1930ల కాలంలోనే 500లకు పైగా సిక్సర్లు బాది చరిత్ర సృష్టించిన ఘనత ఆర్థర్ వెల్లార్డ్ సొంతం. ఆయన వేసిన ప్రతి బంతి ఒక బుల్లెట్ అయితే, ఆయన కొట్టిన ప్రతి సిక్సర్ ఒక సంచలనం. ఏప్రిల్ 8 ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ 'సిక్సర్ కింగ్' అద్భుతమైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

### ఒక సీజన్‌లో 72 సిక్సర్లు..


ఆర్థర్ వెల్లార్డ్ 1935వ సంవత్సరంలో ఒకే సీజన్‌లో ఏకంగా 72 సిక్సర్లు కొట్టి అప్పట్లోనే ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ రికార్డు దాదాపు 50 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండిపోయింది. 1985లో ఇయాన్ బోథమ్ 80 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ పేరిటే ఈ రికార్డు ఉండేది. ఆర్థర్ వెల్లార్డ్ ప్రధానంగా ఫాస్ట్–మీడియం బౌలర్. ఇంగ్లాండ్ తరపున కేవలం రెండు టెస్టులే ఆడినప్పటికీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన ఒక లెజెండ్. 417 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో ఆయన 1,614 వికెట్లు పడగొట్టారు. ఇదే సమయంలో ఆయనలోని బ్యాటింగ్ విధ్వంసం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ స్టార్ తన మొత్తం కెరీర్‌లో 12,485 పరుగులు చేయగా, అందులో సుమారు 25 శాతం పరుగులు కేవలం సిక్సర్ల ద్వారానే రావడం విశేషం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన మొత్తం 500 కంటే ఎక్కువ సిక్సర్లు బాదారు. ఆ రోజుల్లో ఈ గణాంకాలు అంటే ఊహాకందనివి.

### ఒకే ఓవర్‌లో ఐదు సిక్సర్లు..

ప్రస్తుతం టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు చూడటం అరుదుగా జరుగుతుంటుంది. కానీ వెల్లార్డ్ 1930 ల్లోనే రెండుసార్లు ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు బాది చరిత్రాక రికార్డు నెలకొల్పారు. ఒకసారి డెర్బీషైర్‌పై, మరోసారి కెంట్ జట్టుపై ఆయన ఈ ఫీట్ సాధించారు. గ్యారీ సోబర్స్ 6 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ రికార్డే అగ్రస్థానంలో ఉండేది. భారీ సిక్సర్లకు మారుపేరైన వెల్లార్డ్, క్రికెట్ ప్రపంచంలో మొట్టమొదటి పవర్ హిట్టర్‌గా నిలిచిపోయారు. నేడు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లాంటి వారు సిక్సర్ల రికార్డులను తిరగరాస్తున్న తరుణంలో, అసలు సిక్సర్ల మ్యాజిక్ ప్రారంభించిన ఆర్థర్ వెల్లార్డ్ చరిత్రను గుర్తు చేసుకోవడం ప్రతి క్రికెట్ అభిమానికీ స్ఫూర్తిదాయకం.



# అల్లు అర్జున్ రాకా!




## టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మును పెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# దురంధర్-2 విజయంపై స్పందించని దీపిక

### విమర్శకులకు ఘాటు సమాధానం ఇచ్చి నటి

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్, అక్షయ్‌ఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్



### వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా మ-ఌస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.






# లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ స్టేజ్‌పై నయన్ సర్‌ప్రైజ్

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విఘ్నేష్.. ధనుష్ గురించి మాట్లాడుతూ..'ధనుష్ సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని ఎప్పుడూ గొప్పగానే చూస్తాను. జులై 28 ఆయన బర్త్ డే. అది మా మా నాన్న చనిపోయిన రోజు. దాని వల్ల ధనుష్ లో నేను నా తండ్రిని చూసుకున్నట్లు ఫీల్ అవుతాను. ఆయన మీద అంత ప్రేమ ఉంది' అని అన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**